

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి గడువు పొడిగింపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్‌బి.శంకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 50 పాఠశాలలు, 10 జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాల, (సాధారణ, మైనారిటీ) మొత్తం 61 విద్యాలయాలు నడుపుతున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థల్లో ఖాళీలు నింపేందుకు ఏప్రిల్ 25న పాఠశాల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 5వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా పాఠశాల విద్యార్థులు రూ.100, కళాశాల విద్యార్థులు రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

50 గ్రామాల్లో..

దాహం.. దాహం..!

వెంకయ్య వయ్యేరు ప్రాజెక్టు పనులు పూర్తికాని ఫలితం - ప్రజలకు అందని రక్షిత తాగునీరు

జిల్లాలో ఏదో ఒకచోట నీటి కష్టాలు చూస్తూనే ఉంటాం. అయితే పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఎక్కడికెళ్లినా మీకేం కష్టాలు అంటారు.. చక్కగా గోదావరి ఉంది.. తాగేందుకు నీరు.. పంటలు పుష్కలంగా పండించేందుకు సాగునీరు ఉందని అంటుంటారు. ఇది వినడానికి బాగానే ఉన్నా.. ఇక్కడ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు దానికి విరుద్ధంగా కన్పిస్తాయి. ఎందుకంటే చుట్టూ నీరున్నా తాగడానికి పనికిరావు. ఇదంతా మన పాలకుల మహత్యమే. నీటి వనరుల సంరక్షణ మాని, అసంబద్ధ విధానాలతో ఉన్న నీటి వనరులను కలుషితమయం చేశారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. దీంతో తాగడానికి నీరు లేకపోగా.. కలుషిత వాతావరణం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు ప్రజలను కబళిస్తున్నాయి.



వెంకయ్య వయ్యేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టాలోని ప్రధాన కాల్వల్లో వెంకయ్య వయ్యేరు కాల్వ ఒకటి. ఆ పంట కాల్వ పక్కనే ఉన్న నీరు తాగడానికి పనికి రాదని నిపుణులు తేల్చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. దీంతో వేలాది మంది ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. జిల్లాలోని ఐదు మండలాలకు చెందిన 50 గ్రామాల ప్రజలకు వెంకయ్య వయ్యేరు కాల్వ నీరే ఆధారం. దీంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పనులు సగం వరకూ పూర్తి చేశాక అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఇప్పటి వరకూ నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. దీనికి నిలువెత్తు నిదర్శనం రూ.30 కోట్ల విలువైన పైపులైన్ పనులు.

కాలువ పారేదిలా..!

వెంకయ్య వయ్యేరు కాలువ పెంటపాడు మండలం పరిమెళ్ల లాకుల దిగువన ప్రారంభమవుతోంది. గణపవరం మండలం కొమ్మర, వాకపల్లి, గణపవరం, సరిపల్లి, నిడమర్రు మండలం భువనపల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి, ఉండి మండలం పెదకాపవరం, గొల్లగూడెం, క్షత్రియపురం, ఆకివీడు మండలం పెదకాపవరం మీదుగా చినకాపవరం వైర్లు వద్ద కలుస్తుంది. చినకాపవరం వద్ద కాలువ రెండు పాయలుగా చీలి ఒకటి చినకాపవరం కాలువగా, మరొకటి కొత్త వెంకయ్య వయ్యేరు (ఏలూరుపాడు) కాలువగా ప్రవహిస్తోంది. కొత్త వెంకయ్య వయ్యేరు కాలువ నీరు ఆకివీడు, కాళ్ల మండలాల్లోని సుమారు 20 కిలోమీటర్లు పొడవునా ప్రవహించి కాళ్ల మండలం కలవపూడి శివారు ఉప్పుటేరులోకి కలుస్తుంది. చినకాపవరం కాలువ ఎనిమిది కిలోమీటర్లు ప్రవహించి ఆకివీడు మండలం సిద్ధాపురం వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది. పరిమెళ్ల లాకుల నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న చినకాపవరం వరకూ వైర్లు నిర్మించారు. వైర్లు వద్ద ఐదు అడుగులకు వించి నీరు వస్తే ఉప్పుటేరులోకి విడుదల చేస్తారు.

300 మురుగు కాల్వల నీరు ఈ కాలువలోకే..!

పరిమెళ్ల దిగువన ఉన్న కాశిపాడు, కొమ్మర వద్ద బోడపాడు, సరిపల్లెలో పాలకోడు, వెంకాయమ్మ కోడు, విల్లకోడు, మసికోడు, భువనపల్లి కోడు, వాలుకోడు, బొండాడకోడు, సంఘకోడు వంటి 300 మురుగు కాలువల నీరు వెంకయ్య వయ్యేరులో కలుస్తోంది. అదేవిధంగా రైస్‌మిల్లు మురుగు సుమారు 20 వేల ఎకరాల పంట పొలాల్లో మురుగు వేలాది ఎకరాల చేపలు, రొయ్యల చెరువుల్లో కలుషిత నీరు వెంకయ్య వయ్యేరులోనే కలుస్తుంది. దీనికి తోడు గణపవరంలో గ్రామస్తులు, హోటళ్లలో వాడకం నీరు చెత్తాచెదారం వయ్యేరులోకి వదిలేస్తున్నారు. గణపవరం, క్రొవ్విడి గ్రామాల్లో శ్మశానవాటికలు ఈ కాలువ గట్లపైనే ఉన్నాయి. దీంతో వెంకయ్య వయ్యేరు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కాలువలో ఎప్పుడూ 400 ఘనపటడుగుల నీరు నిల్వ ఉండటంతో చిన్నపాటి వర్షానికి వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి.

ఈ సమస్యను 2004లో అప్పటి ఉండి ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా గ్రామాల్లో తాగునీరందించాలనే బృహత్తర ఆశయంతో 2006లో వైఎస్ఆర్ రూ.30 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయినా నిధులు లేమి, రెండు పర్యాయాలు ఎంఎల్ఎగా పని చేసిన శివరామరాజు, ప్రస్తుత ఎంఎల్ఎ మంతెన రామరాజు శ్రద్ధ చూపకపోవడంతో పనులు పూర్తి కాలేదు. పెంటపాడు మండలం పరిమళ్ల లాకుల నుండి కాళ్ల మండలం కలవపూడి వరకూ కాలువ గట్టు వెంట సుమారు 40 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ నిర్మించేందుకు రూపకల్పన చేశారు. రెండు విడతలుగా అప్పటి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. మొదటి దశ పనులను 2006లో రూ.10 కోట్లతో ప్రారంభించారు. పరిమెళ్ల లాకుల నుంచి ఆకివీడు మండలం గుమ్ములూరు వరకూ 25 కిలోమీటర్ల మేర భారీ పైప్‌లైన్ నిర్మించారు. పరిమెళ్ల లాకుల వద్ద 3.5 లక్షల సామర్థ్యం కలిగిన ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్, గుమ్ములూరు వద్ద 2.5 లక్షల సామర్థ్యం గల ట్యాంకు, భారీస్థాయిలో సంపు నిర్మించారు. 30 కిలోమీటర్ల మేర పివిసి పైపులతో ప్రధాన పైపులైన్ నుంచి గ్రామాల్లోని తాగునీటి చెరువులకు అనుసంధానించారు. ఈ పనులు 2008 జూన్‌లో పూర్తయ్యాయి. వీటిలో అధిక శాతం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతున్నాయి.



వెంకయ్య వయ్యేరులో వేసిన పైప్‌లైన్

రెండో దశ పనులను 2009లో రూ.8 కోట్లతో ప్రారంభించారు. ఆకివీడు మండలం గుమ్ములూరు నుంచి కాళ్ల మండలం వరకూ సుమారు 14 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని తాగునీటి చెరువులను ప్రధాన పైపులైన్‌తో అనుసంధానం చేశారు. పరిమెళ్ల లాకుల వద్ద 100 హెచ్‌పి విద్యుత్ మోటర్లు మూడు, గుమ్ములూరు వద్ద 40 హెచ్‌పి మోటార్లు మూడు, 24 గంటలు విద్యుత్ సరఫరాకు ప్రత్యేక విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ పనులు 2011 డిసెంబర్ నాటికి పూర్తయ్యాయి. మొదటి, రెండో విడతల్లో చేసిన పనులు పొంతన లేకుండా సాగాయి. మొదటి విడతలో చేయాల్సిన పనుల్లో విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు ఏర్పాటు చేయలేదు. రెండో విడత పనులు పూర్తయ్యేసరికి మొదటి దశలో నిర్మించిన పైపులు వెంకయ్యవయ్యేరులోకి జారిపోతున్నాయి. ఇక మూడో విడతలో చేయాల్సిన పనులపై ఇంతవరకూ స్పష్టత లేదు.

పునర్నిర్మాణ పనులు..

తాగునీటి ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి తేవాలని 2014-15లో మొదటి, రెండు విడత మిగులు నిధులతో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. పరిమెళ్ల, కొమ్మర, గణపవరం, క్రొవ్విడి, పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, తరటావ, కోళ్లపర్రు గ్రామాల పరిధిలో వెంకయ్యవయ్యేరు, చినకాపవరం డ్రెయిన్‌లోకి 12 చోట్ల జారిపోయిన సుమారు 960 మీటర్ల మేర పైపులను వెలికి తీసి కాంక్రీట్‌తో మళ్లీ ఏర్పాటు చేశారు. పనులన్నీ పూర్తి చేసి తాగునీటి పైపులైన్ ప్రాజెక్టు వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ ప్రాజెక్టు అసంపూర్ణంగా నిలిచింది..

మంతెన రామరాజు, ఉండి ఎంఎల్ఎ



వెంకయ్య వయ్యేరు ప్రాజెక్టు పనులు రూ.30 కోట్లతో ఆర్భాటంగా ప్రారంభించిన పనులు ఇంకా పూర్తి కాలేదు. రూ.30 కోట్ల వరకూ ఖర్చు చేసినా 30 లీటర్ల నీళ్లు కూడా పైపుల ద్వారా వచ్చిన దాఖలాల్లేవు. సాంకేతికపరమైన అంచనాల్లో ఇంజినీరింగ్ అధికారుల, ప్రభుత్వ వైఫల్యం వల్ల చేపట్టిన పనులు నిరుపయోగంగా మారాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ వేస్తామని ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు. తాగునీటి సమస్య తీవ్రమై కేన్సర్, కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని గోదావరి నుంచి నీరు నేరుగా మంచినీటి చెరువులోకి వచ్చేలా పైపులైన్ ఏర్పాటు చేస్తే నీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన నీరు వస్తుంది.

సువిధ ద్వారా 368 ప్రచార అనుమతుల జారీ

రూ.81.76 లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్

ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్




ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ, ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇంతవరకూ 368 అనుమతులు ఇచ్చామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 601 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 368 అనుమతులు జారీ చేయగా మరో 30 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయబడని 203 తిరస్కరించబడ్డాయన్నారు. సి-విజిల్ ద్వారా 181 ఫిర్యాదులు అందగా వాటిలో 95 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మరో 86 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 68 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా చేబట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికలు కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా మొత్తంగా రూ.81.76 లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. నిరంతర నిఘాలో భాగంగా 45 ఎఫ్ఎస్‌టి, రాష్ట్ర సరిహద్దుల వద్ద 10 ఎస్ఎస్‌టి, జిల్లాలో మిగిలిన ప్రాంతంలో 28 ఎస్-ఎస్‌టి, 24 వీడియో సర్వేలేన్స్ బృందాలు పని చేస్తున్నాయన్నారు. ఈ బృందాల పని తీరును పరిశీలించేందుకు సంబంధిత వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీటి కదలికలను కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

కొల్లేరు పరిరక్షణలో భాగస్వాములు కావాలి

డిఎఫ్ఒ హిమశైలజ



నిడమర్రులో చదును చేసిన భూమి


ప్రజాశక్తి - ఏలూరు

ఎంతో విశిష్టత ఉన్న కొల్లేరు సరస్సును చేపల చెరువులుగా మార్చకుండా, సంప్రదాయక వ్యవసాయం చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకుంటూ కొల్లేరు సరస్సు పరిరక్షణలో అందరూ భాగస్వాములవ్వాలని డిఎఫ్ఒ హిమ శైలజ కోరారు. ప్రజలు అటవీశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలో ఐదో కాంటూర్‌లో చేపల చెరువులు, ఆక్వా సాగు చేయరాదని స్పష్టం చేశారు. రైతుల పట్టా భూముల్లో సంప్రదాయక వ్యవ సాయం చేసుకునేందుకు ఎటువంటి అభ్యంతరమూ లేదని అటవీ శాఖ అధికారులు చెబుతున్నామని గుర్తు చేశారు. నిడమర్రులో వ్యవసాయం కోసం భూమిని బాగుచేస్తామని చెబుతూ చేపల చెరువులకు అనుగుణంగా చేస్తున్న తవ్వకాలను అటవీశాఖ అధికారులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారన్నారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో అక్కడున్న ట్రాక్టర్లను బయటికి పంపి చెరువుల పనులను నిలిపివేశామన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా గుర్తింపు పొందిన కొల్లేరును సంరక్షించేందుకు ప్రభుత్వం 1999లో సరస్సును కొల్లేరు అభయారణ్యంగా నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అటువంటి విశిష్టత కలిగిన కొల్లేరు సరస్సును కాపాడుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నగదు పట్టివేత

ప్రజాశక్తి - కామవరపుకోట

సార్వత్రిక ఎన్ని కల నేపథ్యంలో కామవరపుకోటలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా ముగ్గురు వ్యక్తుల నుండి మొత్తం రెండు లక్షల రెండు వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి ఎమ్‌డి. మొహిద్దీన్ తెలిపారు. ఏలూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.52,900, కామవరపుకోటకు చెందిన వ్యక్తి నుండి రూ.86,400, పెదతాడేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి నుండి రూ.62,700 వాహనాల తనిఖీల్లో భాగంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సొమ్మును స్థానిక తహశీల్దార్ జెవిఆర్.రమేష్, తడికలపూడి ఎస్ఐ జయబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సత్యవేణికి అందజేశారు. ఈ నగదు తాలూకు ఆధారాలు ఏలూరు ట్రెజరీ ఎన్నికల అధికారికి చూపిస్తే సంబంధిత వ్యక్తులకు అందజేస్తారని తలెఇపారు. తనిఖీల్లో సిబ్బంది కె.రామకృష్ణ, జి.సూర్యారావు, స్వామి, నాగార్జున, షేక్ నాగూర్ సాహెబ్ పాల్గొన్నారు.



పట్టుబడిన నగదుతో అధికారులు


జీలుగుమిల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రం వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తున్న ఐషర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహన డ్రైవర్ మహ్మద్ రఫీ వద్ద రూ.95 వేల నగదును గుర్తించినట్లు మండల ఎన్నికల అధికారి ఆర్‌వి.వెంకటేశ్వరావు తెలిపారు. నగదుకు సంబంధించి ఎటువంటి రశీదులూ లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని ఖజానా కార్యాలయానికి తరలించనున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో చెక్‌పోస్ట్ సూపరింటెండెంట్ ప్రసాద్, నిఖిల్ మధు శరణ్, విఆర్ఒ రాజు, చెక్‌పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

ఐదుగురిని సస్పెండ్ చేయాలని మండల నేతల తీర్మానం

మండల నేతలను సస్పెండ్ చేయాలని నారాయణపురం గ్రామ కమిటీ డిమాండ్

వాడీవేడిగా ఉంగుటూరు రాజకీయం



సొంత పార్టీ నాయకులను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్న నారాయణపురం టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని తెలుగుదేశం పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఉంగుటూరు సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. అప్పటి నుంచి టిడిపి, జనసేన మధ్య వివాదం నడుస్తోంది. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ద్వారకాతిరుమల పాదయాత్ర శుక్రవారం రాత్రి నారాయణపురం చేరినప్పుడు టిడిపి మండల అధ్యక్షుడు పాతూరి విజయ్‌కుమార్, మాజీ ఎంపిపి గోలి శ్రీనులపై టిడిపికే చెందిన నారాయణపురం నేతలు దాడికి పాల్పడ్డారని విజయకుమార్ గ్రూపు ఆరోపిస్తుంది. దీంతో టిడిపిలో గ్రూపు విభేదాలు రోడ్డున పడ్డాయి. ఆ తర్వాత శనివారం జరిగిన టిడిపి మండల కమిటీ అత్యవసర సమావేశంలో దాడికి పాల్పడిన నారాయణపురానికి చెందిన టిడిపి గ్రామాధ్యక్షుడు, మండల కార్యదర్శి, మరో ముగ్గురిని సస్పెండు చేస్తున్నామని, దీన్ని ఆమోదించాలంటూ తీర్మానించి లేఖను క్రమ శిక్షణా కమిటీ, జిల్లా పార్టీకి పంపారు. అయితే సస్పెన్షన్‌కు గురైన నాయకులకు సంఘీభావంగా నారాయణపురానికి చెందిన కొంత మంది నాయకులు, కార్యకర్తలు మండల కమిటీతోపాటు పలువురు రాష్ట్ర స్థాయి నేతలపై ఘాటైన ఆరోపణలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడుతో పాటు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న పలువురు పేర్లతో లేఖ రాసి వారిని సస్పెండ్ చేయాలని టిడిపి నారాయణపురం గ్రామాధ్యక్షుడు వీరబాబు, మండల కార్యదర్శి ఆనంద్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ లేఖను భీమడోలులోని పార్టీ కార్యాలయం ప్రతినిధికి ఆదివారం అందజేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో టిడిపిలో ఎన్నడూ బహిర్గతం కాని గ్రూపు విభేదాలు రోడ్డున పడటంతో రానున్న రోజుల్లో ఏ పరిణామాలు చోటుచేసుకుంటాయోననే చర్చ ప్రారంభమైంది. ఏదేమైనా జనసేన అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి ఉంగుటూరు నియోజకవర్గ టిడిపి శ్రేణుల్లో అలజడి ప్రారంభమైందనడంలో ఎటువంటి సందేహమూ లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ప్రజా కళాకారుడు అప్పారావు మృతి

సిపిఎం నేతల సంతాపం



అప్పారావు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అత్తిలి

సిపిఎం మంచిలి గ్రామ సీనియర్ సభ్యులు, ప్రజా కళాకారుడు కలిగొట్ల అప్పారావు (75) ఆదివారం మంచిలిలో తన స్వగృహంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. మంచి స్వరం, కంఠం ఉండడంతో సిపిఎం కార్యక్రమాలను మైక్ ద్వారా అనౌన్స్ చేస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం నిర్వహించేవారు. కంజిరి కథ కళారూపాల ప్రదర్శనలో ఆయన దిట్ట. వందలాది వేదికలపై ఆ కళారూపాన్ని ప్రదర్శించి అందరికీ సుపరిచితులయ్యారు. అప్పారావు మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్‌తోపాటు సిపిఎం మండల, మంచిలి గ్రామ శాఖ సంతాపం తెలిపాయి. అప్పారావు మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటని గోపాలన్ అన్నారు. 50 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమంతో సుదీర్ఘకాలం సంబంధం కలిగి ఉన్నారని తెలిపారు. సిపిఎం తణుకు డివిజన్ కమిటీ సభ్యులుగా, అత్తిలి మండల సభ్యులుగా, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారని తెలిపారు. అప్పారావు మృతి పట్ల కె.ధర్మేంద్ర, ఎం.సురేష్, పాతాళ పద్మారావు, రాగిరెడ్డి వెంకట్రావు, ధర్మేంద్ర, అప్పన్న రాంబాబు, నక్కా శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

కొల్లేరు సమస్యల పరిష్కారం మాతోనే సాధ్యం

కైకలూరు బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్

మరి పదేళ్లుగా ఎందుకు పట్టించుకోలేదో : కొల్లేరువాసులు

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారం బిజెపితోనే సాధ్యమని మాజీ మంత్రి, బిజెపి ఎంఎల్ఎ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ వ్యాఖ్యలను కొల్లేరు ప్రజలు తప్పుబడుతున్నారు. మరి పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. ఆదివారం స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్‌లో కొల్లేరు లంక గ్రామ ప్రజల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు కుదింపే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. మరి గతంలో ప్రధాని మోడీ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని ఇచ్చిన హామీ ఏమైందనే చర్చ కొల్లేరు వాసుల్లో మొదలైంది. కాంటూరు కుదింపు మాట అటుంచి ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో మరిన్ని ప్రాంతాలకు కొల్లేరును విస్తరిస్తున్నారని, ఎన్నికలు రావడంతో కాంటూరు కుదింపు పల్లవి ఎత్తుకున్నారని విమర్శిస్తున్నారు. దీంతోపాటు కొల్లేరు ప్రజలకు ఉపాధి అంశం కూడా కేంద్రం విస్మరించిందని వాపోతున్నారు. ఎన్నికల సమయంలోనే బిజెపికి కొల్లేరు సమస్య గుర్తుకొస్తుందా అని పలువురు నిలదీస్తున్నారు.

నరసాపురం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు ఎసి బోగి

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు మే 1వ తేదీ వరకూ అదనంగా ఎసి కోచ్ ఏర్పాటు చేస్తూ రైల్వేశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ రైలుకు ప్రస్తుతం ఎసి త్రీటైర్ మూడు కోచ్‌లు, ఎసి టూ టైర్ ఒక కోచ్ అందుబాటులో ఉన్నాయి. అదనంగా అందుబాటులోకి తీసుకొస్తున్న కోచ్‌లో సగం ఎసి ఫస్ట్ క్లాస్, మిగిలిన సగం ఎసి సెకండ్ క్లాస్ కేటాయించనున్నట్లు పాలకొల్లు రైల్వే అధికారులు తెలిపారు.



సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సాగరతీరం.. ఆనందకరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరు పాలెంబీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివే కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

స్వర్ణాంధ్రలో ఉచితంగా 'పాలిసెట్' శిక్షణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం గ్రామం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో పాలిసెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్.కిరణ్మయి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు పాలిటెక్నిక్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అంతేగాక శిక్షణ అనంతరం కళాశాలలో పాలిటెక్నిక్ నమూనా పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాలిసెట్ పరీక్ష రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. మరిన్ని వివరాలకు : 8790663466, 9640435517కి సంప్రదించాలన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దంటే వద్దు..!

రైతులకు సమాచారం ఇవ్వకుండా బిగింపు
ప్రశ్నిస్తే బోరుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని బెదిరింపు
కేంద్ర ప్రభుత్వ పథకం అంటూ.. మీటర్లపై జగన్ ఫొటో

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ బోరు మోటార్లకు మీటర్లు బిగించినట్లైతే పండించిన పంట రుణం కరెంట్ బిల్లులు కట్టడానికే సరిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించే ప్రక్రియ గత కొన్ని రోజులుగా మొదలు పెట్టారు. కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ శాఖాధికారులు బిగించడంతో రైతులు వ్యతిరేకిస్తున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది మాత్రం మీటరు వద్దంటే మీ బోరుకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని బెదరిస్తూ, మీటర్లు బిగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైకి చెప్పడం కేంద్రప్రభుత్వం పథకం అంటూనే మీటర్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉండటం విశేషం. ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు వైసిపి ప్రభుత్వం కేంద్రంతో చేతులు కలిపి మమ్మల్ని కష్టాలు పాలు చేసేందుకు కుట్రపన్నిందని రైతులు వాపోతున్నారు.

మన పక్క రాష్ట్రమైన తెలంగాణలో వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించడం వ్యతిరేకిస్తే, మన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మీటర్లు బిగిస్తామని చెప్పి కేంద్రంతో మాట్లాడి రూ.3,500 కోట్లు తీసుకున్నాడనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే భవిష్యత్‌లో కరెంట్ బిల్లులు కట్టి, పంటలు పండించుకునే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇండ్లలో వాడే గ్యాస్ బండ్లకు కేంద్ర ప్రభుత్వం దశల వారీగా సబ్సిడీ ఎత్తివేసినట్లు, దశలవారీగా స్మార్ట్ మీటర్లు ద్వారా వచ్చిన కరెంట్ బిల్లులను కూడా ఎత్తివేసి రైతుల నెత్తిపై భారం మోపడం తప్పదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రైతులు కట్టకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఆ మీటర్లు రీడింగ్‌ను బట్టి బిల్లులు కడతానని చెబుతూ, లేదా రైతుల అకౌంట్‌లో సంవత్సరానికి ఒకసారి ఆ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వమే వేస్తుందని చెప్పడం ఎ`రిపాటిగా మా రిందన్నారు. ఏది ఏమైనప్పటికీ రైతులు, రైతు సంఘాల నా యకులు కొన్ని సవత్సరాల నుంచి వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగిస్తే రైతులు తాము పండించిన పంటలో వచ్చిన డబ్బులు కట్టినా చాలవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎలక్షన్ సమయం అయినప్పటికీ వచ్చే నూతన ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.


రమణక్కపేటలో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటరు

వైసిపిలోకి మాజీ ఎంఎల్ఎ రామకోటయ్య

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య, అనుచరులు ఆదివారం ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైసిపిలో చేరారు. వారిని ఎంఎల్ఎ వైసిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైసిపి విజయానికి సైనికుల్లా పనిచేయాలని, బడుగు, బలహీన వర్గాలకు, స్త్రీ అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ని మరలా ముఖ్యమంత్రిని చేయాలని తెలిపారు.

'అధికారంలోకొచ్చాక టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తాం'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలో 9, 10, 11వ వార్డుల్లో 'మన ఇంటికి మన పార్థసారధి' కార్యక్రమాన్ని ఆదివారం టిడిపి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు జగదీష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇల్లు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర యువజన అధికార ప్రతినిధిగా సతీష్ నియామకం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టి దేశంలో యువతకు స్ఫూర్తిదాయకంగా, ఆదర్శంగా నిలిచారని కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు లక్కరాజు రామారావు అన్నారు. దేశంలోని యువత కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, పార్టీకోసం కష్టపడే యువతను ప్రోత్సహించే రాజకీయ పార్టీలలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. సీనియర్ నాయకుల మార్గదర్శకంలో యువతే ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధిగా ఏలూరుకు చెందిన రాయల సతీష్‌ని నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు అందజేశారు. తన నియామకం పట్ల రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావుకి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్రకీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


బొమ్మినంపాడులో స్వాతి ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి ఆదివారం మండలంలోని బొమ్మినంపాడులో వైసిపి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైసిపి ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, లేళ్ళ ఆంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌దే'

ప్రజాశక్తి - చింతలపూడి


పరిచయ వేదికలో ఎంపీ శ్రీధర్

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు పేదల ఇంటి వద్దకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ శ్రీధర్ బాబు అన్నారు. చింతలపూడి మండలం కనిపెడా గ్రామంలో మామిళ్లపల్లి రాంబాబుని మండల సచివాలయ కన్వీనర్‌గా నియమించిన సందర్భంగా పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, పరిపాలన అంతా పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. అనంతరం చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మాపై నమ్మకంతో ముఖ్యమంత్రి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారాలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మోలుగుమటి నీరజ సుధాకర్, పొన్నాల అనిత, వెంపకృష్ణ, గిరిభోగారావు, చెంచాం రాజు పాల్గొన్నారు.

'కుట్రపూరితంగా వాలంటీర్ల సేవలు ఆపించారు'

దెందులూరు: నిస్వార్థంగా ముందుకి వచ్చి, ప్రజలకు సేవ చేస్తున్న వాలంటీర్లంటే మొదటి నుంచి చంద్రబాబుకి కక్షపూరితమైన వైఖరే ఉందని, ఆయన కుట్రల వల్లే ఇప్పుడు వాలంటీర్లు ప్రజా సేవకు దూరం అవుతున్నారని దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి ఒక ప్రకటనలో విమర్శించారు. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో తాము ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఉండేలా చర్యలు చేపట్టి అండగా నిలుస్తామని ఆయన ప్రకటించారు. జగన్ మోహన్ రెడ్డి చంద్రబాబు జన్మ భూమి కమిటీల దాష్టీకలను అంతం చేస్తూ, దేశంలోనే తొలిసారిగా వినూత్న సంస్కరణలలో భాగంగా ప్రజల కోసం వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి, ప్రతినెలా ఒకటో తేదీనే అవ్వా తాతలకు, వికలాంగులకు ఇంటి దగ్గరే పింఛన్లు అందించడంలో మొదలు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందించడానికి ప్రభుత్వ ప్రతినిధులుగా వాలంటీర్లను నియమించారు. ప్రతి వాలంటీర్ తన 50 కుటుంబాలకు సొంత కుటుంబ సభ్యుడిగా, శ్రేయోభిలాషిగా వ్యవహరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే చూడలేని చంద్రబాబు, ఏదో ఒక వంకతో ప్రజలకు ఇబ్బంది కలిగించడమే లక్ష్యంగా పని చేస్తారని, రకరకాల కోర్టు కేసులు వేస్తారని, ఈసారి వాలంటీర్ వ్యవస్థపై ఆయన కుట్ర పన్నారని మరోసారి రుజువైందని ఎంఎల్ఎ పేర్కొన్నారు. అందుకే టిడిపి, జనసేన, బిజెపి వాళ్ళ వాలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతూ నోటికొచ్చినట్లు ఉగ్రవాదులు, జిహాదీలు, స్లీపర్ సెల్స్‌తో పోల్చుతూ అత్యంత అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. వాలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు ఈ నీచ రాజకీయాన్ని క్షమించరని అబ్బయ్య చౌదరి వివరించారు. కించపరిచే వాఖ్యలతో వారిని బాధపడెతున్నారని, దమ్ముంటే వాలంటీర్ వ్యవస్థను తొలగిస్తామని వాళ్ళ మ్యానిఫెస్టోలో ప్రకటించగలరా? అని ఎంఎల్ఎ సవాల్ చేశారు.

ఉత్సాహంగా 'న్యూ కీర్తి' వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు

ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామంలోని న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 14వ వార్షికోత్సవం విద్యార్థులు తల్లిదండ్రులతో ఎంతో ఉత్సాహంగా ఆదివారం సాయంత్రం జరిగింది. విద్యార్థులు వివిధ రకాల డాన్సులు, పాటలతో, వేషాలతో, కోలాటాలతో అలరించారు. స్కూల్ కరస్పాండెంట్ నల్లూరి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ స్కూల్ 14వ వార్షికోత్సవం విద్యార్థులతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పిల్లలకు ఇలాంటి ఈవెంట్స్‌తో ఎంతో ఆక్టివ్‌గా తయారవుతారని అన్నారు. తమ స్కూల్‌లో ఎల్‌కేజి నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇలా వార్షికోత్సవ వేడుకలు స్కూలు యాజమాన్యం నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దివ్య పాల్గొన్నారు.

'సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


సాంస్కృతికా కార్యక్రమాల్లో విద్యార్థులు

విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా విద్యార్థులు మక్కువ కనబరచాలని డాక్టర్ బంక రవికుమార్ అన్నారు. నగరంలోని చాటపర్రు రోడ్‌లోని వినాయక నగర్‌లో ఉన్న భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ కల్చరల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వెస్ట్ జోన్ జెడ్ ఇఒ ఎ.శ్రీమన్నారాయణ రెడ్డితో కలిసి డాక్టర్ బంక రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా మక్కువ చూపాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, కావున ప్రతి విద్యార్థి విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బెస్ట్ యూనిఫామ్, బెస్ట్ అటెండెన్స్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ జి.కోటేశ్వరరావు, చామ్స్ ప్రిన్సిపల్ బి.సంధ్యారాణి, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీస్తు శాంతిమార్గం మానవాళికి స్ఫూర్తిదాయకం

ఈస్టర్ వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


ఏలూరు టౌన్: ప్రార్థనలో కలెక్టర్ దంపతులు

క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, సత్ప్రవర్తన, ప్రేమ, సేవా భావ గుణాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక అమీనాపేట రిజర్వ్ పోలీస్ లైన్‌లోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో కుటుంబ సమేతంగా ఆయన పాల్గొన్నారు. షెరిఫ్ పాస్టర్ రెవ డా.వర్ధనపు మిల్టన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి కలక్టర్ దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు దీవెనలు అందజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరలకు కలెక్టర్ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మన సమాజంలో సామరస్య స్ఫూర్తిని పెంపొందించుకోవడానికి క్రీస్తు ప్రభువు పవిత్రమైన ఆలోచనలను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పాస్టర్ రెవ.డానియల్ అభిలాష్ పాల్గొన్నారు.

దెందులూరులోని శుద్ధీకరణ మాత దేవాలయంలో క్రీస్తు పునరుత్థాన మహోత్సవం వేడుకగా జరిగింది. దెందులూరు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పాల్గొని ఈస్టర్ సందేశాన్ని వినిపించారు. ఆలయంలోని శుద్ధీకరణ మాత విగ్రహానికి పూలమాల వేసిన చింతమనేని ప్రభాకర్, ఆలయ విచారణ గురువు ఫాదర్ అమ్మన్ రాజుకి పుష్పగుచ్ఛం అందించి అందరికీ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు ఫాదర్ అమ్మన్ రాజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చింతమనేని ప్రభాకర్‌కు దీవెనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు పార్టీ మండల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లు బాబు), సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచి తోట ఏసమ్మ, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ఎలీషా పాల్గొన్నారు.

పోలవరం: మండలంలోని పలు గ్రామాలైన పోలవరం, పట్టిసీమ, ప్రగడపల్లి, కొత్త పట్టిసీమ గూటాల గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాధుల తోటలో చనిపోయిన తమ కుటుంబీకుల సమాధులపై పూలతో అలంకరించి, కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి ఎడి ఆశీర్వాదం, చర్చి సిఆర్‌డి ఇమ్మానుయేల్, ఆల్టర్నేట్ డెలిగేట్ జి.అబ్రహం, సంఘ పెద్దలు, సంఘస్తులు, సండే స్కూల్ పిల్లలు, కొత్త పట్టిసీమ సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దెందులూరు రూరల్ : ఏసుక్రీస్తు పునరుత్థానమ్ విశ్వాసానికి ప్రతీక అని సాల్వేషన్ ఆర్మీ రిటైర్డ్ కల్నల్ జోషి అన్నారు. ఆదివారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ సమాధుల తోటలో కోర్ ఆఫీసర్ రమణయ్య ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మృతులైనవారి బంధువులు కుటుంబ సభ్యుల సమాధులను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. సమాధుల వద్ద వారి కుటుంబ సభ్యులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మృతులు చేసిన సేవలు, కుటుంబ జీవన విధానాన్ని గుర్తుచేసుకొని కొనియాడారు. అనంతరం దెందులూరు సాల్వేషన్ చర్చిలో కోర్ ఆఫీసర్ రమణయ్య ఈస్టర్ పర్వదిన ప్రాముఖ్యతపై మాట్లాడుతూ విశ్వాసం, ప్రార్థన రక్షణ, పునరుద్దానం క్రైస్తవ జీవన విధానం లక్ష్యంగా కావాలన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, సత్ప్రవర్తన, ప్రేమ, సేవాభావం గుణాలతో ఉండాలన్నారు. అనంతరం క్రైస్తవ గీతాలాపలతో ఏసు క్రీస్తును ఘనపరిచారు. విశాఖపట్నం నుంచి వచ్చిన విశ్వాసులు ప్రత్యేక గీతాలపనలను చేశారు. వారిని జోషి కోర ఆఫీసర్ రమణయ్య, సంఘస్తులు అభినందించారు. దెందులూరు సాల్వేషన్ ఆర్మీ సంఘస్తులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని దర్భగూడెం, కామయ్యపాలెం, జీలుగుమిల్లి, ములగలంపల్లిలోని పలు ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విచారణ కర్తలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీస్తు ప్రభువు పవిత్రమైన ఆలోచనలను స్మరించుకోవాలన్నారు.

ముదినేపల్లి: క్రీస్తు పునరుత్థాన వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈస్టర్ పర్వదిన సందర్భంగా మండలంలో పలు ప్రార్థనా మందిరాల్లో తెల్లవారుజాము నుంచే క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు త్యాగాలను గుర్తు చేస్తూ క్రైస్తవ సోదర సోదరీమణులకు ప్రత్యేక సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సంఘాల్లో దాతలు, భక్తులు సహకారంతో ప్రేమ విందులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంఘాల విశ్వాసులు, సంఘపెద్దలు, యూత్, స్త్రీల సమాజ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ముసునూరు : ఈస్టర్ పండుగ పర్వదినాన ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు పదజాలంతో స్మరించుకున్నట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని పాస్టర్ జోసెఫ్ తంబి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని 16 గ్రామాల్లో ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని అందరూ భక్తి భావాజాలంతో వుండాలని కోరారు.

బాలలతో భిక్షాటన చట్టరీత్యా నేరం

జిల్లా బాలల సంక్షేమ అధికారి సూర్య చక్రవేణి

ప్రజాశక్తి - చింతలపూడి

బాలలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి పద్మావతి, జిల్లా బాలల సంక్షేమ అధికారి సూర్యచక్రవేణి తెలిపారు. వారు ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలంలో జరుగుతున్న సరమ్మ తిరునాళ్ళలో చిన్నారి రంగులు వేసి రాత్రంతా కూర్చోపెడుతున్నారని వచ్చిన సమాచారం ప్రకారం కలెక్టర్ ఆదేశాల మేరకు లింగపాలెం మండలం సరమ్మ తిరునాళ్ళలో అవగాహన నిర్వహించి, బాలల విద్య హక్కు కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాలలతో భిక్షాటన చేయిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సమాచారం ఇవ్వాలని డిసిపియు వర్కర్ రాజేష్, అవుట్ రీచ్ వర్కర్ రాజ్ కుమార్ తెలిపారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఫైర్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ పిడిసి సునీల్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో బోయగూడెం, సుబ్రంపేట చర్చిలలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవలే మరణించిన పాస్టర్ దానం కుమార్ కుటుంబాన్ని, భాను కుటుంబాన్ని, ధర్మాజీ జిల్లా ఎయిమ్ కన్వీనర్ రమేష్ భూపతి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ప్రాముఖ్యత కలిగిఉందన్నారు. స్వచ్ఛందంగా ఓటు వేసి మనందరం దేశం పట్ల ప్రేమ, అభిమానం చాటుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ జిల్లా సెక్రెటరీ బోసిరి రాంబాబు, ఎన్.ఎస్.రాజేంద్ర పాల్గొన్నారు.

'టిడిపి, జనసేన కూటమికి మద్దతు'

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలో ఈసారి జరగబోయే ఎన్నికల్లో ఎఆర్‌పిఎస్ నాయకులంతా టిడిపి, జనసేన కూటమిని బలపరచాలని తీర్మానించుకున్నారని ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దెందులూరు నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ ప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెదవేగి మండల స్థాయి ఎంఆర్‌పిఎస్ నాయకులు చోడిమెళ్ళ నిరీక్షణ, జొన్నకూటి జాన్, తాడిగడప వెంకటపతి, చాలపాటి నాగరాజు, బొబ్బూరి మిఖాయేలు అన్నారు. ఆదివారం పెదవేగిలో ఎంఆర్‌పిఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మాదిగలకు వర్గీకరణ ఫలాలు అందాయన్నారు. హైదరాబాద్‌లో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ శంఖారావ భారీ బహిరంగ సభకు దేశ ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించి మాదిగలు ఆనాడిగా అభివృద్ధికి దూరంగా ఉన్నారని చెప్పారని నాయకులు గుర్తు చేశారు. కూటమిని గెలిపిస్తామన్నారు.

టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించుకునేలా మనమంతా ఐక్యంగా పోరాడాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. నారాయణపురంలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజులతో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించి రాష్ట్రం, కేంద్రంలోనూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు చేసేలా గెలిపించాలని ఎంపీ అభ్యర్థి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శరణాల మాలతీరాణి, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలంటూ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావ నాగరాజు కోరారు. మండలంలోని అల్లాపురంలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి నాగరాజు ఎన్నికల ప్రచారం చేశారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టిడిపినాయకులు సన్నాగారు, ముంగ్గా బాలరాజు, దాసరి శ్రీను, పత్తి శివ, సింగరాతి సత్యనారాయణ, బొమ్మన బోయిన వెంకటరత్నం పాల్గొన్నారు.

ఏ పార్టీ కలిసి రాలేదు: ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

తన రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఏ రాజకీయ పార్టీలు తనకి అచ్చురాలేదని, స్వతంత్ర అభ్యర్థిగానే తనను తన కార్యకర్తలు గెలిపించారని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నూజివీడు మండలం పెద్ద రావిచర్ల గ్రామంలో ముద్దరబోయిన అనుచరులు అభ్యర్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరంలోనూ తాను స్వతంత్ర అభ్యర్థిగానే గెలిచి, గెలిచిన అనంతరం నియోజకవర్గ అభివృద్ధి తాను పార్టీలకు అతీతంగా కృషి చేసినన్నారు. ఒ పార్టీ కండువాపై గెలిపిస్తున్నప్పుడు ఆ ప్రాంత అభివృద్ధి పై గెలిచిన పార్టీ నుంచి అనేక అవరోధాలతో పాటు అనుకూలతలు కూడా ఉంటాయన్నారు. కానీ స్వతంత్ర అభ్యర్థిగా గెలిస్తే ఏ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. నూజివీడు నియోజకవర్గం కొందరు నాయకులు వల్లే టిడిపి ఓటమి పాలవుతోందని ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. 2014లో టిడిపి తరపున పిలిచి టికెట్ ఇవ్వడంతో ఇక్కడ పోటీకి వచ్చానని, అప్పటి నుంచి పది సంవత్సరాలుగా కార్యకర్తలకు అండగా ఉన్నానని, ప్రతి కార్యకర్త తమ ఓటుతో పాటు మరో ఐదు ఓట్లను వేయించగలిగితే నూజివీడు నియోజకవర్గంలో ముద్దరబోయిన గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - మండవల్లి

భర్త వేధింపులు తాళలేక మహిళ విషం తాగి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మండవల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిసి కాలనీకి చెందిన ముద్దుల సాయికృష్ణ రాధకు 2014వ సంవత్సరంలో వివాహమవగా వారికి ఇద్దరు మగపిల్లలు కలరు. అయితే సాయికృష్ణ మద్యానికి బానిసై భార్యను నిత్యం వేధిస్తూ, అక్రమ సంబంధాలు అంటగడుతూ మానసికంగాను, శారీరకంగాను హింసిస్తూ ఉండేవాడు. భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అసహనం గురైన భార్య మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో కూల్ డ్రింక్‌లో ఎలుక మందు కలుపుకొని తాగేసింది. అయితే ఈ విషయాన్ని మరుసటి రోజు భర్తకు చెప్పింది. వెంటనే భర్త వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం మచిలీపట్నం, అక్కడి నుంచి విజయవాడ తరలించారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో మృతి చెందినట్లు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త ఇచ్చిన రిపోర్టును ఆధారం చేసుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు ఢీ : భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని రావిచర్ల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ నుంచి ట్రక్కు విడిపోయి ఎదురుగా వస్తున్న మెటుకుమిల్లి నాగమల్లేశ్వరరావు(48), అతని భార్య వీరమ్మ(42)ల బైక్‌పై వస్తుండగా వారిని ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు రిఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ములగలంపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేయగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,250 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకొని వారందర్నీ పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేలకొరిగిన భారీ వృక్షం

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్నో సంవత్సరాలు గలిగిన భారీ వృక్షం నేలకొరగడంతో చింతలవల్లి గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఆదివారం మండలంలోని చింతలవల్లి గ్రామంలో 150 సంవత్సరాలు గలిగిన మర్రిచెట్టు ఆర్అండ్‌బి రహదారిపై అడ్డుగా పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. నూజివీడు, ముసునూరు మీదుగా వెళ్లే ఆర్‌టిసి బస్సులు వయా చింతలవల్లి వెళ్లకుండా ముసునూరు మీదగా ఏలూరు చేరుతున్నాయి.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాబోయే రోజుల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ సహకారంతో, కేంద్రంలో ఉన్న మోడీ నాయకత్వంలో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు అన్నారు. శాంతినగర్ 6వ రోడ్‌లో ఉన్న ఏలూరు నియోజకవర్గ పార్లమెంటు కార్యాలయంలో ఆదివారం టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో 6 అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.